వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
స్థాపితం 1994
అమెరికా తెలుగు సాహిత్య వేదిక

# తెలుగు కథ శతవార్షికోత్సవాలు

## ఫిబ్రవరి, 2009, హైదరాబాదు

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
స్థాపితం 1994
అమెరికా తెలుగు సాహిత్య వేదిక

ఫిబ్రవరి, 1909 లో ప్రచురించబడిన మహాకవి గురజాడ అప్పారావు గారి "దిద్దుబాటు", "మీ పేరేమిటి?" అనే రెండు కథలు తెలుగు సాహిత్య చరిత్రలో మామూలు మనుష్యులు మాట్లాడుకునే వ్యావహారిక భాషలో వెలువడిన మొట్టమొదటి తెలుగు కథలు అని విజ్ఞులూ, చరిత్రకారులూ నిర్ధారించారని అందరికీ తెలిసినదే. తెలుగు కథకి వందేళ్ళు నిండబోతున్న రాబోయే ఫిబ్రవరి, 2009 నెలలో మన **తెలుగు కథ శతవార్షికోత్సవాలు** సముచిత స్థాయిలో నిర్వహించాలని **వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా** (హ్యూస్టన్ మరియు హైదరాబాదు) వారు తలపెట్టారు. "మహాకవి" గురజాడ అప్పారావు గారి దివ్యస్మృతికి అంకితం ఇవ్వబడుతున్న ఈ శతవార్షికోత్సవాలలో ఈ క్రింది అంశాలు ప్రధానంగా ఉంటాయి అని వంగూరి ఫౌండేషన్ అధ్యక్షులు వంగూరి చిట్టెన్ రాజు (హ్యూస్టన్, టెక్సస్) తెలిపారు.

- కనీసం వంద మాత్రమే తెలుగు కథా సంకలనాలు/సంపుటులు ఈ శతవార్షికోత్సవాల వేదిక మీద ఆవిష్కరించడం. ఇతర భాషలనుంచి తెలుగులోకి అనువదించబడిన కథలు, ఇతర భాషలలోకి అనువదించబడిన తెలుగు కథల సంకలనాలు/సంపుటులు కూడా ఆమోదయోగ్యాలే.
- ఆయా రచయితలకి తమ గొంతుకలో తాము రచించిన ఒక కథ తగిన కాలపరిమితిలో వినిపించే అవకాశం కలిగించడం.
- ఈ నాటి తెలుగు కథ స్వర్ణయుగాన్ని ఆవిష్కరించిన అత్యుత్తమ కథారచయితలని, ప్రచురణకర్తలనీ, ఇతర ప్రోత్సాహకులనీ గౌరవించడం.
- గత వంద సంవత్సరాల తెలుగు కథ తీరుతెన్నులు శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించే చర్చావేదిక.
- మన తెలుగు కథ భవిష్యత్తుపై ఈ తరం కథకుల అభిప్రాయాలు, ప్రపంచీకరణ ప్రభావాలపై చర్చావేదిక.

ఈ **తెలుగు కథ శతవార్షికోత్సవాలలో** పాల్గొనదల్చుకున్న వారందరూ ముందుగానే నమోదు చేసుకోవలసి ఉంటుంది. రిజిస్ట్రేషన్ వివరాలు, స్థానిక నిర్వాహకుల వివరాలు త్వరలోనే ప్రకటించబడతాయి. హైదరాబాదులో రెండు రోజుల పాటు జరిగే ఈ శతవార్షికోత్సవాలలో తమ సరికొత్త సంకలనాలు/సంపుటులు ఆవిష్కరించి, తెలుగు కథారచయితలలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోదల్చిన్న రచయితలు, ఈ ప్రతిష్ఠాత్మక శతవార్షికోత్సవాలలో పాల్గొనదల్చుకున్న తెలుగు భాషా, సాహిత్యాభిమానులూ, తెలుగు సాహిత్యానికి గర్వకారణమైన ఈ శతవార్షికోత్సవాలను తగిన స్థాయిలో ఆర్థికంగా సమర్థించి తమ భాషాభిమానాన్ని చాటిచెప్పి, వ్యాపారాభివృద్ధిని కూడా కోరుకునే స్పాన్సర్లనీ, మన తెలుగు భాషకి ప్రపంచస్థాయిలో గుర్తింపు కోసం మేము చేస్తున్న ప్రయత్నాలకు చేదోడు, వాదోడుగా సహాయం చెయ్యదల్చుకున్న శ్రేయోభిలాషులందరినీ vangurifoundation@yahoo.com ద్వారా సంప్రదించమని నిర్వాహకులు కోరుతున్నారు. రచయితల కథాసంకలనాల ప్రచురణలో కానీ, ఖర్చులలో కానీ, వంగూరి ఫౌండేషన్ వారికి ఎటువంటి ప్రమేయమూ లేదనియూ, ఆవిష్కరణకి ఆమోదించే అన్ని విషయాల లోనూ సర్వహక్కులూ వంగూరి ఫౌండేషన్ వారివే అనీ, ఇందులో ఉత్తర ప్రత్యుత్తరాలకి ఏ విధమైన అవకాశం లేదనీ ఫౌండేషన్ నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు.

# ఆహ్లాదకర కథల పోటీ!

ఇంటింటిపత్రిక

## ప్రథమ బహుమతి : రు. 3,000/- :: ద్వితీయ బహుమతి : రు. 2,000/-

సినిమాలు కానీండి, సాహిత్యం కానీండి - అవి రెండు రకాలుగా చూసేవారిని, చదివే వారిని ప్రభావితం చేసి ఆకట్టుకుంటాయి. మనసును కలచివేసి ఆలోచింపజేసేవి కొన్నీ, మనసును చికాకుల నుండి తప్పించి ఆహ్లాదపరచేవి మరికొన్ని. ఈ రెండు రకాల్లోనూ నిష్ణాతులైన వారు అద్భుత ఫలితాలు సాధించి ప్రజాజీవనాన్ని ఉత్తేజపరిచారు. ఆహ్లాద పరిచే రచనలు చదివితే మనసు తేటబారుతుంది. తద్వారా కుటుంబంలోనూ, బైటి పరిచయస్థులతో మెలిగేటప్పుడూ ఆ తేటబారిన ఆహ్లాదకర మనసు ప్రవర్తించే విధానం సజావుగా ఉండి తోటివారి మెప్పు పొందేలా చేస్తుంది. తద్వారా సభ్య సమాజంలో నిర్మలమైన మనసుతో మనుగడ సాగించే వెసులుబాటు కలుగుతుంది. ఇది మంచి సమాజం రూపుదిద్దుకోవడానికి పరోక్షంగా దోహదపరడుతుంది. అందుకే - ఈ ఆహ్లాకర కథల పోటీ!

### రచయిత / రచయిత్రులకు సూచనలు

- కథాంశం ఏదైనా ఆహ్లాదకరంగా ఉండాలి. నీతులను గానీ, సందేశాలనుగానీ, క్లిష్టమైన విషయాలను గానీ చెప్పాలనుకున్నా అవి ఈ ఆహ్లాదకర చట్రంలో సజావుగా ఇమిడిపోవాలి.
- ఇంతకు ముందు ఎక్కడా ప్రచురితం కాని రచనల్ని మాత్రమే పోటీకి పంపాలి. హామీపత్రం తప్పనిసరి!
- కథలు వ్రాతప్రతిలో 10-12 పేజీలు ఉంటే ఉభయతారకం.
- ఇ-మెయిల్ ద్వారా పంపబడే సాఫ్ట్ కాపీ కథలు అంగీకరింపబడవు.
- తగినన్ని పోస్టలు స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవరు జత చేసిన వారికి మాత్రమే ప్రచురణకు స్వీకరింపబడని కథలను త్రిప్పి పంపడం జరుగుతుంది. అయినా జెరాక్స్ కాపీలు ఉంచుకోవడం మంచిది - పోస్టల్ మిస్సింగ్స్‌ను దృష్టిలో ఉంచుకుని.
- బహుమతులు పొందని కథల్లో కొన్ని సాధారణ ప్రచురణకు స్వీకరించబడతాయి. ఆ వివరాలు 'రచన'లో ప్రచురింపబడతాయి. వాటికి ప్రత్యేకంగా పారితోషికం అంటూ ఉండదు.
- న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు
- కథకులు తమ చిరునామా; ఫోన్ నెం; ఇ-మెయిల్ వివరాలు స్పష్టంగా రాయాలి.
- పొట్టి పేర్లు, కలంపేర్లు ఉపయోగిస్తుంటారు కొందరు కథకులు. అంచేత చెక్కుల మీద రాయాల్సిన పేరు స్పష్టంగా తెలియజేయాలి.
- ఇంతకుముందు కొన్ని సందర్భాలలో కొందరు కథకులు ఫలితాల ప్రకటన తర్వాత తమ కథలను ప్రచురింపవద్దని కోరారు. ఇది సత్సంప్రదాయం కాదు. న్యాయనిర్ణేతల నిర్ణయాన్ని ఆమోదించ యిచ్చగించని వారు పోటీలలో పాల్గొనకుండా ఉంటే మంచిది!

**ఈ 'ఆహ్లాదకర కథల పోటీ'ని స్పాన్సర్ చేస్తున్న శ్రీ యండమూరి వీరేంద్రనాథ్‌గారు బహుమతి పొందిన కథకులకు చెక్కులు స్వయంగా పంపుతారు.**

## ముగింపు తేది : నవంబరు 15, 2008
## ఫలితాల ప్రకటన : జనవరి, 2009

రచనలు పంపవలసిన చిరునామా :

'రచన' ఇంటింటి పత్రిక; 1-9-286/2/పి. విద్యానగర్, హైదరాబాద్ - 500 044.

సంపుటి : 8
సంచిక : 6
సెప్టెంబరు : 2008

ఇంటింటిపత్రిక

190

పేజీలు : 100
వెల : రూ. 20/-

ముఖచిత్రం : శ్రీ సిద్ధి వినాయకుడు      చిత్రకారుడు : కరుణాకర్



చిరునామా :1-9-286/2/P, విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర), హైదరాబాద్-500 044. ఫోన్ : (ఆ) : 2707 1500 (ఇ) : 2707 7599

*email : rachanapatrika@hotmail.com, rachanapatrika@gmail.com   www.rachana.net*



సంపాదకీయం..... 5

## కథలు

మతిమెరుపు - ఇచ్ఛాపురపు రామచంద్రం 18
కథాపీఠం కథ :: ఆముక్త మాల్యద - వాసుదేవ్ 23
కథాపీఠం కథ :: పాశుపతం - గోవిందరాజు రామకృష్ణారావు 29
మా తెలుగుతల్లికి సెల్ పూదండ - వసుంధర 33
విద్య నిగూఢంబు విత్తము.... - ఎ. సువర్ణ 38
విప్లవం - పులిపాక వేణుగోపాల్ 45
ఆరాధ్య దేవత - రామలింగ శర్మ దంతుర్తి 52
మానవత్వం - కస్తూరి విజ్ఞాన సౌజన్య సుధీమతి 59
మన్నించవా... చిన్నా! - ఎం.ఆర్. అరుణకుమారి 66
అద్దెకు గర్భం - శింగిసెట్టి సంజీవరావు 79
సృష్టిలో తీయనిది - శారద 83
అనగనగా ఒక మంచి కథ :: ఏక్ దిన్ కా... - డి. హనుమంతరావు 86

## ప్రత్యేక రచనలు

డెబ్భయ్ రెండు సంవత్సరాల 'మాల్గుడి'! - తాజీ ప్రసాద్ 63

## శీర్షికలు

ఉత్తర రచన 6
పజిలింగ్ పజిల్ నిర్వహణ : డా॥ ఎన్. సురేంద్ర 8
సాహితీ వైద్యం - వసుంధర 73
మూడుప్రశ్నలు - ఒకే సమాధానం 93

## సీరియల్ రచనలు

మెలికల మరులు - ఎలక్ట్రాన్ 12
రాణీగారి కథలు - సలీం 49
అమెరికామెడీ కబుర్లు - వంగూరి చిట్టెన్ రాజు 94

## అక్కడక్కడక్కడా

కార్టూన్లు


వచ్చే సంచికలో....

**బి. శశి; వై.ఉషాకిరణ్; మరువాడ రాజేశ్వరరావు; గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు; విహారి; పి.ఎస్. నారాయణ; ఆత్మకూరు భారతి; ఎమ్మెస్వీ గంగరాజు తదితరుల కథలు**

ప్రత్యేక రచన : మన పురాణం (లేక) చేప కథ - డా॥ డి. విద్యేశ్వరి

**సలహాదార్లు**

కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా



**మార్కెటింగ్**

పి.ఆర్. మార్కెటింగ్
1-2-559/సి, మొదటి అంతస్థు,
నల్లకుంట, హైదరాబాద్-44
ఫోన్: 040 -27612041

**సంపాదకుడు**

వై.వి.యస్.ఆర్.యస్.తల్పశాయి

**అసోసియేట్ ఎడిటర్**

'హంసలేఖ'

***The Only Magazine Administered by Writers***

**జూ**న్ నెల సంచిక చదివి శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ ఫోన్ చేసి "ఏమిటండీ ఈసారి వేసిన మొదటి మూడు కథలూ ముసలి వాసన వేస్తున్నాయ్. పూర్వం వచ్చిన 'ప్లెజెంట్' స్టోరీస్ కోసం ప్రయత్నం చేయకూడదా" అన్నారు. "చాలా కథలు అలాంటివి ఉండడంతో కావాలనే వేశాను. ప్లెజెంట్ స్టోరీస్ ఎప్పుడోగానీ రావడం లేదు. అలాంటివి రాసేవాళ్ళూ తగ్గిపోయారు" అన్నదానికి, "పోనీ అలాంటి కథలకు పోటీ పెట్టే ఆలోచన చేయండి. నేను స్పాన్సర్ చేస్తాను" అన్నారు. ఈ ప్రతిపాదనకు అంత సానుకూలంగా ఆలోచన కదలలేదు. అప్పుడే ఒక సంఘటన గుర్తొచ్చింది. 1993-94 ప్రాంతాల్లో ఆంధ్రజ్యోతి వారపత్రిక వారు 'రైటర్స్ వర్క్‌షాప్' పెడ్తూ కారాగార్ని ఒప్పించి తీసుకురమ్మని కోరితే వెళ్ళడం జరిగింది. ఒక సెషన్‌లో యండమూరి, మధుబాబు, నేను వేదిక మీద - మధుబాబు మంచి కథ గురించి మాట్లాడుతూ "కాలేజీ వార్షికోత్సవ సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ బ్యాగ్రౌండ్‌లో చక్కటి కథ వచ్చింది. పేరు గుర్తు లేదు. రచయితా గుర్తు లేదు. కథ మాత్రం గుర్తుంది" అంటే యండమూరి "అవును - నాకూ ఇష్టం ఆ కథ" అన్నారు. "ఆ కథ' 'అంతిమ విజయం' అనీ, రచయిత ఎమ్.ఆర్. ప్రసాద్ (కోయంబత్తూర్) అనీ, జూన్ 1992 సంచికలో 'అనగనగా ఒక మంచికథ' శీర్షికన పునఃప్రచురణ జరిగిం"దనీ చెప్పాను. ఆ తర్వాత మాటల్లో "మీరు చేసే రచనలకీ, మీరు మెచ్చిన కథకీ...." అన్నదానికి "నా రచనలు నాకు ఇష్టమై నేను రాసేవి. నాకు నచ్చినవి, నేను మెచ్చేవి భిన్నంగా ఉండవచ్చు గదా" అన్నది మధుబాబు జవాబు. ఇదిలా ఉంచితే -

"అమెరికా తెలుగు కథానిక" కొత్త సంకలనం తయారీలో "ఆరాధ్య దేవత" అనే కథ తటస్థ పడింది. ఆధునిక టెక్నాలజీ సహకారంతో ఎన్నడో దూరమైన ఇద్దరు కలిసిన వైనం చక్కగా ఆవిష్కరింపబడింది. తర్వాత "మా తెలుగు తల్లికి సెల్ పూదండ" అందగా అందులో ఆధునిక టెక్నాలజీ తీరుస్తున్న అవసరాల కన్నా దాని పట్ల 'క్రేజ్'ని పెంచుకుంటున్న వైనం విశదమయింది. అప్పుడే పూర్వం ప్రచురింపబడి నా సేకరణలో ఉన్న అనేకానేక కథలు స్మృతిపథంలో మెదిలేయి. "ఏక్ దిన్ కా...." కథలో మానవ నిర్మిత దేవాలయం నాగార్జునసాగర్ డామ్ నేపథ్యం - అక్కడి చారిత్రాత్మక అంశాల వివరణ - ఓ అబ్బాయి ఆరాధన - వెరశి ఓ ఆహ్లాదకరమై అనుభూతి. నలభై ఏడేళ్ళ తర్వాత కూడా గుర్తున్న ఈ కథ మంచికథే అన్నది నమ్మకం! ఇలాంటివే - *పోరబాటా? - గ్రహపాటా?* (రంజన్). జోగిపంతులు ఆత్మశాంతికి (వేదుల కామేశ్వరరావు); దీపావళి - తూటా లడాయి (జి. సాంబశివరావు); ఉత్తరం (పి.వి.యస్.రావు); పూర్ణయామిని (ఝాన్సీ); అగ్గిబరాటా (ఆదివిష్ణు); మన రాజధాని పోకడ (ఎమ్.ఎల్.పతి); ఆద్యంతాల మధ్య అతను (సింగరాజు రామచంద్రమూర్తి); బామ్మా - బొచ్చుకుక్కా (శర్మ) తొలి బాధా- తీయని ప్రేమా (డి. హనుమంతరావు), లిల్లీ - మల్లీ (రావు); హృదయాంతరంగంలో (బుల్లిరాజు); గ్రీటింగ్ కార్డ్ (హవిస్); అరుణ రాగం (ఉమాపతి పద్మనాభశర్మ); మత్కుణాలూ - మల్లికార్జునరావూ (మృదంగ); చక్కటి కథ (భారతి); భగ్నప్రేమికుడు (యల్లంశెట్టి శాయి); ముక్కు పోడీ - డొక్కు సైకిలూ (క్రోవి రామమోహన్‌శాస్త్రి & బుర్రా వెంకట్రాయశర్మ); గుండు కథ (తంబు); పొరపాటు (ఇసుకపల్లి దక్షిణామూర్తి) గుర్తుకొచ్చేయి. ఈ కథారచయితల్లో ముగ్గురు నలుగురు మాత్రం ఆ తర్వాత విరివిగా రాశారు. అయినా దాదాపు అర్థ దశాబ్దం తర్వాత కూడా లీలామాత్రంగానైనా గుర్తున్నాయంటే అవి మంచి కథలనే అర్థం కదా! ఆయా కథా రచయితలంతా ఇప్పుడెక్కడున్నారో కానీ తెలుగు కథ శతజయంతి జరుపుకోబోతున్న తరుణంలో వారందరికీ శుభాభినందనలు తెలుపుకోవడం మా కనీస ధర్మం!

ఇలాంటి ఆహ్లాదకర కథలకు కథావిశ్లేషకుల విశ్లేషణల్లో స్థానం దొరక్కపోవచ్చు. కానీ అవి సామాన్య పాఠకుడి మనసుకు స్వాంతన చేకూరుస్తాయి. తద్వారా కుటుంబానికీ, సమాజానికీనూ! అందుకే అలాంటి ఆహ్లాదకర కథల కోసం మరో ప్రయత్నంగా పోటీ నిర్వహిస్తున్నాం పాత, కొత్త కథకులు ఈ మా ప్రయత్నాన్ని సఫలీకృతం చేయగలరన్న ఆశాభావంతో....

**190**

**ఈ పత్రిక మీది! మీ అభిరుచుల మేరకు పత్రికను రూపొందించడం మా వంతు!! అభిమానించి ఆదరించడం మీ వంతు!!!**

# ఉత్తర రచన



ఇప్పుడు 'రచన' కథల పత్రిక అయిందని సంతోషంగా ఉంది. ఒకే ఒక సీరియల్.

కథల్లో 'సలీం'గారివి ప్రస్తుత సమాజానికి దర్పణం. కథల్లో మంచివే చాలావరకు. ఈ నెల కథ 'నెమిసిస్' కథాపీఠం అలంకరించ తగ్గది. తాడిగిరి పోతరాజుగారు పాత తరం వారు, ఉత్తమ కథకులు. వారి కథ చదవడం ఇన్నాళ్ళకు. మళ్లీ ఆ రోజులు గుర్తుకు వస్తున్నాయి.

– పి.వి. రామారావు (ఖమ్మం)

పజిలింగ్ పజిల్ 189లో ఆధారాలకు గళ్ళకు పొంతన కుదరడం లేదు. వేరే పజిల్ గళ్ళు ఈ పజిల్‌కు ప్రచురించారు. ఇలాంటి పొరబాట్లు మావంటి పజిలింగ్ పజిల్ ప్రియులకు నిరాశను కలిగిస్తాయి. మీరు వచ్చే సంచికలో ఇదే పజిల్‌ను ప్రచురించి గడువును మరో నెల పొడిగిస్తారనే విషయం మాకు తెలుసు. అలా చేస్తే ఒక పజిల్ వాయిదా పడుతుంది. కాబట్టి సెప్టెంబర్ సంచికలో పజిలింగ్ పజిల్ 189కి సంబంధించిన గడికట్టు (గ్రిడ్)ను మాత్రమే ప్రచురించండి. పజిలింగ్ పజిల్ 190 యథాప్రకారం ప్రచురించండి. 189వ పజిల్‌కి సంబంధించిన క్లూస్ మరియు కూపన్‌లకై ఆగస్టు సంచికలో చూడమని చెప్పండి. రెండు పజిళ్ళకు గడువు తేదీ ఒకటే ఇవ్వండి. వచ్చే నెల వరకు వేచి చూసే ఓపిక లేక నిబంధనలకు వ్యతిరేకమని తెలిసినా నేనే గ్రిడ్‌ను తయారుచేసుకుని నింపి పంపుతున్నాను. అంగీకరించడం, అంగీకరించకపోవడం మీ ఇష్టం. మూ.ప్ర.ఒ.స. ప్రతినెలా ఇవ్వడం లేదు. కానీ ప్రతినెల దానికి సంబంధించిన కూపన్ వ్యర్థంగా ప్రచురిస్తున్నారు. అలాగే నేను మెచ్చిన కథ శీర్షిక విషయంలో కూడా, కథాప్రహేళిక ఫలితాల ప్రకటన ఇవ్వడం లేదు. పజిల్, మూ.ప్ర.ఒ.స. ఫలితాలు కూడా రెండు మూడు నెలలవి ఒకసారి ఇస్తున్నారు. ఏ నెలకు ఆ నెల ఫలితాలు ప్రకటించే ప్రయత్నం చేయండి. పత్రికా నిర్వహణ కత్తిమీద సాములా మారిన నేటి పరిస్థితుల్లో ప్రకటనలు (ఇన్‌హౌస్ ప్రకటనలు మినహా యింపు) లేకుండా 100 పేజీల పత్రికను 20 రూపాయలకే నెల నెలా వెలువరించడం నిజంగా సాహసమే. ఐతే 100 పేజీలను నింపడానికి మీరు తంటాలు పడుతున్నట్లు మేము భావిస్తున్నాము. ఉదాహరణకు ఆగస్టు సంచికను 80 పేజీలకు కుదించలేరా? ఆలోచించండి. నిజంగా 100 పేజీల మేటర్ ఉంటే ఎటువంటి అభ్యంతరమూ లేదు. సాహితీవైద్యంలో సూచించినట్లు పర్యావరణ పరిరక్షణకు చెందిన చిట్కా మీకు కూడా అన్వయిస్తుంది. మరికొన్ని సూచనలు మరోసారి.

– కోడీహళ్లి మురళీమోహన్ (హైదరాబాద్)

*(పజిలింగ్ పజిల్ 189 గురించి మీ సూచన పాటిస్తున్నాము. మీ లాగానే పి. వసంతభాను; మీనా శివలెంక (హైదరాబాద్) గ్రిడ్ తయారు చేసుకొని పంపారు. మీ అందరికీ అభినందనలు! మీరంతా మళ్ళీ గ్రిడ్ పూరించి పంపాల్సిన అవసరం లేదు. మిగతా విషయాలు – పీత కష్టాలు పీతవి*

*– సం॥)*

ఆగస్టు సంచిక 'రచన'లో పజిలింగ్ పజిల్ 189లో మీరు ఇచ్చిన ఆధారాలకు – ఇచ్చిన పట్టిక (గళ్ళ పట్టిక)కు ఎటువంటి సంబంధం కుదరటం లేదు. బహుశ – మీరు తరువాతి సంచిక – పట్టిక (190)ది ఇచ్చి ఉంటారని భావిస్తున్నాను.

మీరు ఇచ్చిన ఆధారాల ప్రకారం నేను గడి – పట్టికను గీసుకొని గడులను పూర్తి చేసి (విడి కాగితము మీద) పజిలింగ్ పజిల్‌ను పంపుతున్నాను.

మీరు కొత్తగా మొదలు పెట్టిన ఈ పజిలింగ్ – పజిల్ పద్ధతి బాగుంది. కాని ప్రతిసారి – ఒక గడి మాత్రం ఆగిపోతోంది. అన్ని ఒకటి, రెండు రోజులలో ఆధారాలు దొరుకుతున్నాయి కాని – ఎక్కడో ఒకటి రెండు మాత్రం అస్సలు కుదరటం లేదు. దాని మూలంగా ప్రతి నెలా ఆ ఒక్క ఆధారము తెలియక పజిలింగ్ పజిల్ పంపలేకపోతున్నాను. ఉదా: 188లో 23 ని॥ 28 అ॥ ఆధారాలు తెలిసినట్టే ఉంటున్నాయి కాని పూర్తి చేయలేకపోతున్నాను. అదేవిధంగా 189లో 52 అ॥ కూడా. ఏదో ఒక్క గడిలో మాత్రమే సమాధానం తెలియక పజిలింగ్ పజిల్ పంపలేని నెలలు ఎన్నో ఉన్నాయి.

– శివలెంక మీనా (హైదరాబాద్)

జులై నెల కథాపీఠం పురస్కారమందు కొన్న కథ 'నెమిసిస్' గురించి ఏమి వ్రాసినా తక్కువే. దయ, తృప్తి లేని మనిషి – స్వార్థ మంతా రూపుకడితే మల్లారెడ్డి. మల్లారెడ్డి పటేలు ఎంతమందికో ప్రతినిధి 'బలవం తుడు నాకేమని పలువురితో నిగ్రహించి.... బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదే సుమతీ' అనిన శతకకారుని మాటని ప్రమానంగా ఈ కథని చిత్రీకరించేరు.

తెలంగాణా మాండలిక భాష, అక్కడ యజమాని పాలేరు సంబంధం, వ్యవసాయ

**నెల నెలా రెండు కథలకు, చెరో అర్థ వెయ్యిన్నూట పదహారు రూపాయలు బహుమతి!**

*శ్రీ జనార్దన మహర్షి తెలుగు చలనచిత్రరంగ రచయితగా అందరికీ సుపరిచితులు. 'వెన్నముద్దలు' రచయితగా సాహితీప్రియుల నాకట్టుకున్నారు. ఇటీవలే 'గుడి' నవలను, నేరుగా, పుస్తక రూపంలో ప్రచురించారు. ఆయన ప్రతీ నెలా 'రచన'లో ప్రచురింపబడే కథల (అనగనగా ఒక మంచి కథ; అనువాద కథ; కథాపీఠం కథలు మినహాయించి)లో రెండింటికి చెరో అర్థ వెయ్యిన్నూటపదహారు రూపాయల బహుమతి యివ్వ సంకల్పించారు. ఆగస్టు, 2008 'రచన'లో ప్రచురింపబడిన* **– యజమాని :: శాంతిప్రభాకర్; మృగతృష్ణ :: ఇంద్రగంటి జానకీబాల** *కథలను ఈ బహుమతికి అర్హమైనవిగా నిర్ణయించడం జరిగింది. బహుమతి పొందిన కథకులకు అభినందనలు!*

*బహుమతి ప్రదాత అందజేసిన చెక్కులను కథారచయితలకు పంపడం జరిగింది.*

– సంపాదకుడు

పరిస్థితులు వర్ణన, మూలమైన లక్ష్యం, అల్ప ప్రాణులకు కొంతైనా దక్కకుండా సమస్తము (తిండీ, నీరు కూడా) కబళించాలనుకొనే బకాసురుల గతి ఏమవుతుందో చిత్రించాలనే పనికి సహాయంగా వున్నాయి.

పందులు, ఎలుగుబంట్లు, కుందేళ్ళు, కోతులు, తేనెటీగలు - ఇవి భూస్వాముల దోపిడీకి గురవుతున్న పీడితవర్గాలకి సంకేతాలు కద. పోయేనాడు వెంబడి రాదు పూచిక పుల్లయినా అని అతని మరణంతో చూపించేరు. "బోడి సలహా... పాతరేకుల డబ్బాలు, కొప్పెరలు, చెంబులు, తపేలాలు కొట్టుకుంటూ కూచోమంటావ్" అని పాలేరు సలహాని తీసిపారేసే అహం. లారీలకి కట్టే ప్లాస్టిక్ తాళ్ళతో వలలు అల్లించి పందుల్ని పట్టడం, మాంసం అమ్మడం! ఏమి ఆలోచనలు.

పెట్టుబడి, లాభం, అది వేస్టు ఇది వేస్టు అని ఆలోచించేవాడు తనే వేస్టయినాడు. చేలు, చెలకలు మన కోసం. అడవులు, పుట్టలు నోరులేని జీవాల కోసం. వాటికి ఆసరా లేకుండా చేస్తే భూదేవి ఊరుకోదు. అంతా మనకే కావాలని వాటేసుకొంటే ఇదే గతి అని శవయాత్రలో ప్రజలు అనుకోవడం బాగా వ్రాసేరు.

మల్లారెడ్డి అంతిమయాత్ర వర్ణన చేస్తూ 'పిడికెడు బూడిదగా మారిన మనిషి' గురించి, విస్తృతమైన విజ్ఞానం సంపాదించి జ్ఞానాన్ని విస్మరించి మానవుడు మానవత్వం కోల్పోయి దానవుడుగా మారుతున్న మానవుడు, స్వార్థమూ, దురాశ క్రౌర్యంతో మనిషి తన మేధాశక్తితో విధ్వంసం సృష్టిస్తు తన ఉనికికే ప్రమాదంగా మారిన తన తనయుడి గురించి కన్నకడుపు తీపితో కుమిలి కుమిలి ఏడుస్తున్న పుడమితల్లి తూర్పున తన కనురెప్పలు తుడుచుకొంటోందన్న ముగింపు మానవత్వం లేని మానవుని గురించి రచయిత నిర్వేదం మనల నాలోచింపచేస్తాయి.

రాచకొండ రచనా పురస్కార గ్రహీత శ్రీతాడిగిరి పోతరాజుగారి 'నెమిసిస్' కథ, ప్రచురించిన 'రచన' సంచిక చదివి భద్రపరచుకోవలసినవి.

- కే॥వేం॥ విజయలక్ష్మి (బెంగుళూరు)

❖

వందనములు. మీతో ఫోన్‌లో మాట్లాడిన ప్రకారం నాకు నచ్చిన కార్టూన్‌ల వివరాలు తెలుపుతున్నాను. మీరు ఆయా కార్టూనిస్టుల చిరునామాలు తెలిపితే వారికి ఒక్కొక్కరికి రూ 100/- చొ॥న పంపగలను.

| | | | |
|---|---|---|---|
| ఏప్రిల్ '08 | రచన లోని | 86 పేజీ | దేవి గారి కార్టూన్ |
| మే '08 | " | 18 పేజీ | కాశ్యప్ గారి కార్టూన్ |
| జూన్ '08 | " | 34 పేజీ | విజయ్ గారి కార్టూన్ |
| జూలై '08 | " | 54 పేజీ | అర్జున్ గారి కార్టూన్. |

ఇవన్నీ గొప్ప కార్టూన్‌లనీ మిగతావి నాసిరకమనీ కాదు గానీ ఇవి కేవలం 'నాకు నచ్చిన కార్టూన్‌'లు.

టి. యస్. కళాధర్ (గుంతకల్లు)

కళాధర్ గారు నా కార్టూన్‌కు (18 పేజీ 'మే' నెల రచన) చిరుకానుక "(Rs 100/-) అందించబడ్డం జరిగినది. కాని, అది నా దృష్టిలో పెద్ద, పెద్ద కానుక. అందుకు, పత్రికా ముఖంగా, కళాధర్ గారికి, మరియు 'రచన' పత్రిక వారికి కృతజ్ఞతలు.

వీలైనచో, ఆ "కార్టూన్"ని తిరిగి ప్రచురించగలరు. (బహుమతి పొందిన కార్టూన్‌గా)

కె.యస్. కాశ్యప్ (విశాఖ)

జూన్ 2008 రచనలో ప్రచురింపబడిన నా (34 వ పేజీలో) కార్టూన్ చూసి ప్రతిస్పందించి "నాకు నచ్చిన కార్టూన్" అంటూ T.S కళాధర్ (పీటర్) గారు 100/- రూ॥ పారితోషికం పంపిస్తూ వ్యంగ్యచిత్రకారుల 'మనస్సు'లను ముగ్ధుల్ని చేసారు.

కళా హృదయంతో, కళాకారుల్ని పోషించాలని, ప్రోత్సహించాలని పాఠకుల హృదయాలలో జనించడం అందుకు గాను కార్టూనిస్టులను సంతృప్తి పరచడం అద్వితీయమైనది. ఇది మరెందరికో స్ఫూర్తి దాయకం. ఇందుకు "రచన" తొలి వారధిగా నిలవడం మాకు మహద్భాగ్యం

- విజయ్ (సుల్తానాబాద్)

# ఆముక్తమాల్యద




**దేవుడిచ్చిన వరాలే మనుషుల్లో కొందరికి శాపాలు. శాపాలను కూడా వరంగా మార్చుకోగలరు మనుషుల్లో దేవతలు – వసుంధర**

మనిషికి జీవితం దేవుడు అడక్కుండా ఇచ్చిన ఓ గొప్ప వరం. జీవితాన్నిచ్చిన తర్వాత కూడా అడిగిన వరాలేవీ ఇవ్వకుండా తనకు నచ్చినవి మాత్రమే ఇవ్వటం, ఆ విధంగా మనిషికి తాను ఎన్నటికీ అర్థం కాకుండా ఉండిపోవడం దేవుణ్ణి మనిషి నుండి విడదీసి గొప్ప వాణ్ణి చేసింది. దేవుడిపై భారం వేయకుండా తన జీవితాన్ని తానే నిర్ధారించాలనుకున్నా, మన జీవితంలో జరిగే ఎన్నో సంఘటనల పర్యవసానం మాత్రం కొన్ని కొన్నిసార్లు జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది.... ఈ కథలో మాల్యద పాత్రలాగా....

• • •

'ఉవ్వెత్తున ఎగసిపడి అంతలోనే అలసిపోయే ఆ కెరటాలు నా యౌవ్వనం.

ఆ కెరటాలకి ఆవల ఆకాశాన్ని తనలో కలిపేసుకుంటున్న అనంత సాగరం నా ఆశయం'.

వైజాగ్ బీచ్ అందాలు చూసినప్పుడల్లా నాలో నేను ఉద్విగ్నంగా గొణుక్కుంటూ ఉంటాను. ప్రకృతిలో మరే వస్తువులోనూ కన్పడని 'జీవం', 'చేతనం' సముద్రంలో కన్పడుతుంది. ఒడ్డుని బలంగా తాకుతూ ఆవేశంగా వచ్చే ఆ కెరటాలని చూస్తే భూమిని కబళిస్తాయా అన్పిస్తుంది. మరో ప్రక్క అచేతనంగా కన్పిస్తూనే ఆకాశాన్ని మింగేసేలా ఉన్న అనంత సాగరం తన హద్దుల్ని కూడా చెరిపేసుకుంటుందా అన్నట్లుంది.

వైజాగ్ బీచ్‌ని చూసిన వారెవరైనా ఆనందంగా స్పందిస్తారు. వారిలో ఎంత భావుకత్వముందో అప్పుడే తెలుస్తుంది. హృదయమంతా కళ్ళు చేసుకుని చూస్తారు. మనసంతా భావుకత్వాన్ని నింపుకుని ఓ షెల్లీయో, ఓ కృష్ణశాస్త్రో మన ప్రక్కనే నిలబడి మరింత హృద్యంగా ఆ సాగరతీరపు ఉత్తుంగ తరంగాలని అభివర్ణిస్తూ ఉంటె వినాలని చాలా బలంగా అన్పిస్తుంది. (ఈ జనరేషన్ యువతకి ఎంత మందికి షెల్లీ, కృష్ణశాస్త్రి తెలుసంటారు?).

మన కథాస్థలం పూర్తిగా ఈ బీచ్ కాదు కాబట్టి కొంచెం ముందుకెళ్దాం. ఈ బీచ్ కెదురుగా ఓ పెద్ద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ – పదేళ్ళ క్రితం కట్టినా ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తూ చాలా పాపులర్ అయిన హాస్పిటల్ వైజాగ్‌లో. ఇక్కడ చాలా రకాలైన సేవలందిస్తున్నా ముఖ్యంగా సంతాన సాఫల్య కేంద్రంగా అందరికీ సుపరిచితం. అది కూడా కేవలం నిష్ణాతురాలైన ఓ లేడీ డాక్టర్ వల్లనే అన్న నిజం చెప్పక తప్పదు. ఆమె డాక్టర్ భారతి. ఈ కథలో ప్రముఖ నెరేటర్. డాక్టర్ భారతి ఈ ఆసుపత్రి కట్టినప్పట్నుంచీ పనిచేస్తున్నా కేవలం 'హస్తవాసి' గల డాక్టర్‌గా కాకుండా అద్భుత నైపుణ్యం గల డాక్టర్‌గా, మంచి మనసున్న మనిషిగా పేషెంట్లందరికీ పరిచయం. నిజానికి ఈ హాస్పిటల్‌కి ఓ పేరున్నా అందరూ భారతీస్ ప్లేస్‌గానే వ్యవహరిస్తుంటారు. ఇక ఈ కథని నడిపించే బాధ్యతని ఆమెకే వదిలేద్దాం.

**భారతీయం**

లండన్‌లో రెండేళ్ళు స్పెషలైజేషన్ చేస్తున్నప్పుడు అక్కడి వెదర్ బాగా నచ్చేది. ముఖ్యంగా నేను పుట్టి పెరిగి చదివింది బెంగుళూర్ కావటం వలన ఇంగ్లాండ్ వెదర్ బెంగుళూర్ వెదర్‌కి దగ్గరగా ఉండడం వల్లన కూడా. కానీ వైజాగ్ వచ్చిన కొత్తల్లో పారిపోవాలన్పించేది. ఇంత వేడి నా కస్పలు

(మిగతా భాగం పత్రికలో చదవండి)

**వసుదేవ్**

ఆహ్లాదకర కథ!

# మా తెలుగు తల్లికి సెల్ పూదండ

"మా తెలుగు తల్లికి మల్లె పూదండ...."

మంచి నిద్రలో ఉన్న నేను మంగ గొంతు విని ఉలిక్కిపడి లేచి పూజగదిలోకి పరుగెత్తాను.

భాషను ప్రేమించే మా ఇంట్లో- నా ఇల్లాలు మంగ 'శంకరంబాడి సుందరాచార్య' పాటతో తెలుగు తల్లికి హారతిచ్చాకే మా దినచర్య - మొదలౌతుంది. నిజాయితీని నమ్మే నేను - వేసిన పూలహారానికి అనువుగా ఆ పాటను మార్చి పాడుతూండాలని- మంగకు గట్టిగా చెప్పాను. తనకు నా మాటంటే ఎంత విలువంటే - ఏ పూలూ లేనప్పుడు తన మెడలోని బంగారు గొలుసు వేసి 'మా తెలుగు తల్లికి బంగారు పూదండ' అని పాడుతుంది. మరి నిన్నరాత్రి సుబ్బారాయుడుగారింట్లో కొత్త పెళ్ళికూతురు శోభకు శోభనమని పెరట్లో మల్లెపూలన్నీ వాళ్ళింటికి పంపేసింది మంగ. మరి తెలుగు తల్లికి మల్లెపూలెక్కడివి?

మంగకు అసత్యదోషం తప్పించాలని పరుగున వెడితే పూజగదిలో తెలుగు తల్లి మెడలో మందార పూదండ వేలాడుతోంది. 'మల్లెపూదండ' అంటూ మంగ పల్లవిని పునశ్చరణ చేసింది.

"ఆగు" అని ఆమె తప్పును ఎత్తి చూపాను.

కానీ, "దేవుడి పూజలో ఒక్కటైనా అన్నప్రకారం చేస్తామా? అన్నీ ప్రత్యామ్నాయాలే కదా! భక్తికి మనసు ప్రధానం" అని సమర్థించుకుంది మంగ.

"ప్రత్యామ్నాయాలు సంస్కృత మంత్రాలకి. తెలుగు పాటకు కాదు" అని నేను నొక్కించడంతో ఆమె ఒప్పుకుని వెంటనే "మా తెలుగు తల్లికి మందార పూదండ" అని పాటను మార్చి పాడింది. కాలకృత్యాలు తీర్చుకున్నాక నేను తెలుగు తల్లికి వందనంచేసి వీధిలోకొస్తే బట్టలకొట్టు అయ్యన్న కనిపించి, "దండాలయ్యా! తమరు హైదరాబాదెప్పుడు వెడుతున్నారు?" అన్నాడు.

"నా హైదరాబాదు ప్రయాణంతో నీకేంపని?" అన్నాను ఆశ్చర్యంగా.

"మా నాన్న భూమయ్య మనుమడి దగ్గరకని హైదరాబాదెళ్ళి మరి వెనక్కు రానంటున్నాడు. తను లేక మా ఇల్లు చిన్నబోయింది. ఆయనకు మీ మాటంటే గురి. కాస్త నచ్చజెప్పి వెనక్కు రప్పించాలి" అన్నాడు అయ్యన్న.

భూమయ్యకు - ఎదుట ఎవరున్నా పట్టించుకోకుండా - చెవి గోక్కుంటూ తనలో తను మాట్లాడుకునే చిత్రమైన అలవాటుంది. ఆయన రోడ్డు మీద నడుస్తూంటే పిల్లలు వెంటపడి ఆటపట్టిస్తూంటారు. ఇక్కడే ఇలాగుంటే పట్నంలో ఇంకెలాగుంటుందోనని ఆయన ఊరొదిలేవాడు కాదు. అలాంటిది నాలుగు నెల్ల క్రితం ఏవో మెడికల్ టెస్టులకని హైదరాబాదు వెళ్ళాడు. మరి తిరిగి రాననడం ఆశ్చర్యమే!

"వెళ్ళేముందు చెబుతాన్లే" అని అయ్యన్నను పంపేసేలోగా ఫోనొచ్చిందంటూ మంగ పిలుపు.

లోపలకెడితే, "దేనికైనా గివ్ అండ్ టేక్ తాతయ్యా! ముందు మీరిక్కడికి రండి. తర్వాత మేమక్కడికి వస్తాం. అదీ నా షరతు" అన్నాడు నా దౌహిత్రుడు కిషోర్ ఫోన్లో.

మా కిద్దరు పిల్లలు. ఇద్దరివీ హైదరాబాదులో పక్కపక్క ఇళ్ళు. అబ్బాయి రమేష్ చార్టర్డ్ ఆకౌంటెంటు. కోడలు జానకి చదువుకున్న గృహిణి. పౌత్రుడు రాజాకి పదేళ్ళు. రాజా చెల్లెలు దీప వాడికంటే రెండేళ్ళు చిన్నది. అమ్మాయి ప్రభ టీచరు. అల్లుడు రామకృష్ణది రియల్ ఎస్టేట్ వ్యాపారం. దౌహిత్రుడు కిషోర్ టెన్తు పరీక్షలు రాసాడు. కిషోర్ చెల్లెలు నవ్య వాడికంటే మూడేళ్ళు చిన్నది.

"అక్కడ మీది ఒంటరి జీవితం! ఆపైన పల్లె జైలు లాంటిది. ఇక్కడ మేము పక్కపక్కనే ఉంటూ లైఫ్ ఎంజాయ్ చేస్తున్నాం.

(మిగతా భాగం పత్రికలో చదవండి)

వసుంధర

# సీక్వెల్ కథలు



# రాణిగారి కథలు

## సలీం

అమీర్ మామయ్య నన్ను వెతుక్కుంటూ మా కాలేజీ కొచ్చాడు.

మా అమ్మకు నలుగురుఅన్నయ్యలు. అందులో అమీర్ అందరికన్నా చిన్నవాడు. మనిషి స్వతహాగా మంచివాడు. మృదు స్వభావి. ఈ మామయ్య ఏరికోరి ఓ అనాథ ముస్లిం పిల్లని పెళ్ళి చేసుకున్నాడని అమ్మ నా చిన్నప్పుడు చెప్పింది. అప్పటి నుండీ అమీర్ మామయ్యంటే ఇష్టం, ప్రత్యేకమైన గౌరవం...

లగేజ్ లేకపోవటం చూసి, "చినగంజాం నుంచి ఎప్పుడొచ్చావు మామూ? ఎక్కడో దిగావు?" అని అడిగా.

"ఈ రోజుదయమే వచ్చాన్రా. కూకట్ పల్లిలో మీ పెద్దమామయ్య ఉన్నాడుగా. వాళ్ళింట్లో దిగాను. నాతో పాటు మీ మామీ కూడా వచ్చింది. ఈ మధ్య దాని కారోగ్యం బాగుండటం లేదు. నీరసంగా ఉందంటూ పడుకుంది."

"యింటికెళ్దాం రా మామూ" అన్నాను.

"ఇప్పుడు కాదులేరా. యింకా చాలా చోట్లకెళ్ళాలి. వచ్చేనెల పదో తారీఖున మా మూడో అమ్మాయి పెళ్ళి. శుభలేఖ యిచ్చి వెళ్దామని వచ్చాను" అన్నాడు. చేతిలో ఉన్న లెదర్ బ్యాగులోంచి పసుపుపూసిన కార్డు తీసి ఇచ్చాడు.

అందులో ఒక వైపు ఉర్దూలో, మరో వైపు తెలుగులో నిఖా ఎప్పుడు జరిగేదీ ఎక్కడ జరిగేదీ ఎవరితో జరిగేదీ రాసి ఉంది. ఉర్దూ చదవటం నాకు రాదు కాబట్టి తెలుగులో ఉన్న వైపు చదువుకుని, "చాలా సంతోషం మామయ్యా. పెళ్ళి చిన్న గంజాంలోనేగా. నేను రాణిని పిల్చుకుని తప్పకుండా వస్తాను" అన్నాను.

అమీర్ అస్థిమితంగా కదిలాడు.

అతను నిశ్శబ్దంగా ఉండటం చూసి నేనే మరలా అన్నాను.

"చినగంజాం చూసి చాలా రోజులైంది మామయ్యా.అక్కడి యిసుక నేల, దొరువులు, మీ యింటి ముందు నిద్రగన్నేరు చెట్టు... అమ్మమ్మ బతికున్న రోజుల్లో నా బాల్యం నాటి మధురమైన జ్ఞాపకాలన్నీ చిన గంజాంతో ముడిపడి ఉన్నాయి మామయ్యా. రాణితో ఎన్నిసార్లు చెప్పానో... ఈ రకంగా నైనా తనకు మా అమ్మమ్మ వూరు చూపించే అవకాశం దొరికింది"

"నువ్వేమనుకోనంటే ఓ మాట సైఫ్.

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*

# కబ్రిమొక్కలు

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు 2008 ఉగాది సందర్భంగా నిర్వహించిన కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

ఆహ్లాదకర కథ!

# ఆరాధ్య దేవత

"నమస్తే మాధవిగారు: నేను అమెరికా నుంచి ఈ ఈమెయిల్ పంపిస్తున్నాను. మీ ఈమెయిల్ ఎడ్రస్ గూగిల్ మీద సంపాదించాను – ఫిషరీస్‌లో, చేపల వేట కంప్యూటర్ సహాయంతో ఎలా ఇంప్రూవ్ చేయవచ్చో అని మీరు పబ్లిష్ చేసిన పేపరు చూసి. మీరు కానీ అయిదేళ్ళ క్రితం సర్దార్ పటేల్ కాలేజీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చదువుకున్నారా? ఇదే పేరుతో నాకు తెలిసిన ఒకావిడ ఉన్నారు. లేకపోతే ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోరని ఆశిస్తున్నాను. ఏదైనా నాకు ఓ రిప్లై ఇవ్వగలరు.... రఘురాం."

"డియర్ రఘురాం సర్: అవును నేను ఎస్.పి. కాలేజీలో చదువుకున్నాను. నాకు పెళ్ళవక ముందు పేరు మాధవి కలువకొలను. పట్టాభిషేకం అయ్యాక అది కాస్తా మాధవి ఓరుగంటి అయ్యింది. మీరుగానీ మాకు కంప్యూటర్ ఇంజినీరింగులో పాఠాలు చెప్పిన ప్రొఫెసర్ రఘురాం కాదు కదా? ఇదే నిజమైతే నాకు మీ వివరాలు అన్నీ చెప్పండి. మీరు అమెరికా ఎప్పుడు వెళ్ళారు? మా వదినగార్ని అడిగానని చెప్పండి :– రిప్లై కోసం ఎదురు చూస్తూ.... మాధవి"

"హల్లో మాధవిగారు : సో, నేననుకున్నట్టు మీరు నా స్టూడెంటే అన్నమాట. అవును నేను మీకు పాఠాలు చెప్పిన రఘురాంనే. పాఠాలు చెప్పి విసుగెత్తి, రివైండ్ అండ్ ప్లే బేక్ చేయలేక అక్కడ్నుంచి పిహెచ్.డి. కోసం అమెరికా వచ్చాను. అదయ్యాక ఇప్పుడు టెక్సాస్‌లో పనిచేస్తున్నాను. మీ వదినగారంటూ ఎవరూ లేరు – ఎందుకంటే నాకు పెళ్ళవలేదు. అయినా ఎవరండీ ఈ వాగుడు కాయను చేసుకునేదీ :– మీరు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? మీ క్లాస్మేట్స్ అందరితో ఇంకా కంటాక్ట్‌లో ఉన్నారా? వాళ్ళందరి విశేషాలు చెప్పండి. మీ ఆయన ఏం చేస్తుంటారు? అడిగినట్లు చెప్పండి. చాలా కాలం తర్వాత మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. మీ ఫ్రెండ్స్ ఎవరైనా అమెరికాలో ఉన్నారా?..... రఘురాం."

"డాక్టర్ రఘురాం: మీ ప్రోగ్రెస్ చూసి కొంచెం అసూయపడ్డ మాట వాస్తవం. నేను డిగ్రీ పూర్తి చేసేసరికి తల తోకకి వచ్చింది. వావ్! పిహెచ్.డి? మీరు మాతో ఎప్పుడు చెప్తూ ఉండేవారు ఎప్పటికైనా డాక్టరేట్ తీసుకుంటానని. మొత్తం మీద సాధించారన్న మాట. చాలా సంతోషం. మా ఆయన పేరు సంతోష్. ఆయన కూడా ఇక్కడే ఢిల్లీలో పనిచేస్తున్నారు. మేమిద్దరం కంప్యూటర్ ఇంజినీర్సే కనుక తిట్టుకున్నా కొట్టుకున్నా మెగా, గిగా బైట్లలోనే :– ఇంకా మా వదినగారు లేకపోవడం దురదృష్టం. నా క్లాస్‌మేట్స్ నలుగురైదుగురు అమెరికాలో ఉన్నారని తెలుసు కానీ మీ ఆరాధ్య దేవత మీకు అతి ద.... గ్గి.... ర.... లో అమెరికాలోనే ఉంది. :–) వివరాలు తర్వాత.... మాధవి."

"మాధవిగారు: మీ ఆయన గురించి తెలిసి 'సంతోషి'ంచాను. ఆయన పేరు ఎలాగా సంతోష్ అన్నారు కదా :–) మీ మెయిల్ చూసి భలే ఆశ్చర్యపోయాను. ఎవరండీ నా ఆరాధ్య దేవత? వివరాలు చెప్పగలరా?.... రఘురాం"

"డాక్టర్ రఘురాం: మీరు నా పేరు బట్టి గూగిల్ మీద నన్ను కనుక్కున్నారు. మేము కంప్యూటర్ ప్రోగ్రామ్స్ రాస్తే అవి అసలు రన్ చేయకుండానే తప్పులు ఎక్కడో ఇలా ఓసారి చూసి

(మిగతా భాగం పత్రికలో చదవండి)

రామలింగ శర్మ వంతుర్తి

# డెబ్బయ్ రెండు వసంతాల 'మాల్గుడి'!

**ఆం**గ్ల సాహిత్యంలో  చెరగని, తరగని కీర్తి గడించిన 'భారతీయ -ఆంగ్ల' రచయితలెందరో వున్నారు. వారిలో ఆర్.కె. నారాయణ్ (రాసపురం కృష్ణస్వామి అయ్యర్ నారాయణస్వామి: 1906–2001) అగ్రస్థానం వహిస్తారు. భాష సరళంగానూ, భావాలు సున్నితంగానూ వుండడం వలన ఆర్.కె. నారాయణ్ అందరికీ అభిమాన రచయిత అయ్యారు. ఆయన కథలలోనూ, నవలలోనూ 'వస్తువు' ఖరీదైనది కాకపోవడంతో పాఠకులు ఆయనకి మరింత సన్నిహితమయ్యారు.

రచయితలు కథలు, నవలలు సృష్టిస్తారు. పాత్రలని సృష్టిస్తారు. ఆ రచనలలో 'వాతావరణం' సృష్టిస్తారు. అయితే ఆర్.కె. నారాయణ్ ఒక ఊరు ఊరునే సృష్టించారు. అదే మాల్గుడి. నిజంగానే ఆ ఊరు వుందని ఇండియా మ్యాప్‌లో వెదికినవారు, రైల్వే టైమ్‌టేబుల్‌లో చూసినవారు వుండకపోరు.

ఆర్.కె. నారాయణ్ తొలి నవల "స్వామి అండ్ ఫ్రెండ్స్" (1935). ఆ నవలతోనే మాల్గుడి వెలుగులోకి వచ్చింది. ఈ నవలలోనే స్వామి తన స్నేహితులతో కలిసి యం.సి.సి. స్థాపిస్తాడు. మెరిలిబోన్ క్రికెట్ క్లబ్‌ని (ఇంగ్లండు) స్ఫురణకు తెచ్చే మాల్గుడి క్రికెట్ క్లబ్ ఇది. మాల్గుడికి మార్కెట్ రోడ్, రీగల్ హెయిర్ కటింగ్ సెలూన్, సరయూ ప్రత్యేకతని తెచ్చాయి.

"స్వామి అండ్ ఫ్రెండ్స్" ప్రారంభిస్తూ విజయదశమి రోజున కలం కాగితం మీద పెట్టినప్పుడు **'మాల్గుడి'** తనకి ప్రత్యక్ష మయిందని ఆర్.కె. నారాయణ్ తన ఆత్మకథలో పేర్కొంటారు.

ఒకసారి ఆర్.కె. నారాయణ్ అభిమాని ఒకరు ఆయనను కలుసుకుని, "నాకు జీవితంలో ఒకే ఒక కోరిక వుంది. ఒక్కసారైనా మాల్గుడి వెళ్ళి తనివి తీరా ఆ ఊరు చూడాలి" అని తన తీరని తీయని కోరిక వెల్లడించాడు.

"తప్పకుండా వెళ్ళండి. మాల్గుడి ఎక్కడ వుందో తెలుసుకుని

(మిగతా భాగం పత్రికలో చదవండి)





ఆహ్లాదకర కథ!

# ఏక్ దిన్ కా...

ఓ అందమైన సాయంకాలం. గాలిలో గడుసు దెయ్యాల్లాంటి గోధుమరంగు మేఘాలు యీదుతున్నాయి. ఆకాశానికి మశూచి వచ్చిందాన్నట్టు మచ్చలు అక్కడక్కడ నీలంగా కనబడుతున్నాయి. రెండు కొండల మధ్య సూర్యుడు అచ్చం బొమ్మల్లో మాదిరి 'పోజు' కొడ్తున్నాడు. కృష్ణ నీలి అద్దాల్లో అందం చూసుకుంటూ. 'డాం' నుంచి కూలివారంతా 'ఓ రెంకటసామి' పాటలు పాడుతూ హుషారుగా యింటికి తిరిగొస్తున్నారు.

పెద్ద రాతిబండ మీద కూర్చొని కంప్రెసర్ భీషణ సంగీతాన్ని వింటున్న రాజు మెదడ్లో పైన చెప్పినవన్నీ మఠం వేసుక్కూర్చున్నాయి. రాజుకి మొదట్నుంచి మేఘాలు, కొండలు, సెలయేరు, చందమామ మలయపవనం లాంటి వంటే మహాయిష్టం. వాటిని చూస్తుంటే అతనలా అలా గాలిలో లేచిపోయి, ఆకాశపు వెండి మైదానాల మీద పరుగెత్తి, ఏడు రంగుల ఆర్చి వంతెనల మీద నీలి అఖాతాల్ని దాటి చందమామని ముద్దుపెట్టుకోగలడు.

సూర్యుడు ఆకాశపు పడమటి కొసల మీద పసుపు, కుంకుమ రంగుల్ని ఎగబోస్తున్నాడు. మరో చివర నల్లటి మేఘాలు గాలి కెరటాల మీద తేలుతున్నాయి. ఎండి, చిక్కిన కృష్ణ తన కడ్డుగా నిలబడ్డ మొరటు బండల్ని తప్పించుకుంటూ ఒదిగి పారుతోంది.

"వ్హాట్ ఎ బ్యూటీ!" అనుకున్నాడు రాజు.

(ఇంగ్లీషు రాని వాళ్ళకి వీలుగా "ఓహో ఏమి అందం!" అని తెలుగులో కూడా అనుకున్నాడు)

"గలగలని వీచు చిరుగాలి గెరటమై
జలజలని పారు సెలపాటలోదేటనై...."

రాజు పెదాలపైన అనుకోకుండానే పాట 'మర్మరి'ల్లింది. రాజు అమోఘంగా పాడగలడు. వెన్నెల రాత్రులు సముద్రపు హోరుకి లయగా అతను పాడిన పాటలెన్నిట్నో పాంబీచ్ రాతి గుట్టలు తిరిగి వప్పజెప్పాయి.

కొండ మలుపులో జీపు హారన్ పలికింది. రాజు తీయని కల చెదిరిపోయింది. రాజు హాట్ సరిజేసుకుని, చేతులో ఫైలు గట్టిగా పట్టుకుని కూలివారికి పని చెప్పటం మొదలు పెట్టాడు, ఒక కంటితో జీపుని కనిబెడ్తూ.

జీపు వెళ్ళిపోతోంది. జీపులో రావు! రావు కూడా తన మాదిరి యింజినీరే! అయితేనేం! తను ప్రొద్దున్న ఏడింటి నుంచీ పన్నెండింటి దాకా గాలువును మేస్తే అతనే వాన్‌లోనో ఎనిమిదింటికి పని మీదికి వెళ్ళి పదింటికల్లా యిటికెళ్ళిపోతాడు.

డి. హనుమంతరావు

# అనగనగా ఒక మంచి కథ...



తను సాయంకాలం అయిదున్నరదాకా పనిమీదనే నిలబడిపోతే, అతను మధ్యాహ్నమంతా గాలి పంకాల క్రింద వట్టివేళ్ళ తడకల మధ్య చల్లగా కూర్చొని ఏదో కాగితాల మీద బరుకుతూంటాడు.

రాజుకి యీ మాదిరి అన్యాయాలెన్నిట్నో తమాషాగా చేసే దేవుడి మీద చాలా కోపం వచ్చింది.

"మనమంతా బానిసలం! గానుగలం, పీనుగులం! వెనక దగా, ముందు దగా! కుడి యెడమల దగా, దగా" రాజుకీసారి పాట రాలేదు. కసిగా వచనమే పలికింది.

లేబరు పని కట్టేసి నెమ్మదిగా యిళ్ళకి జారుకుంటున్నారు. రాజుకి కదల బుద్దేయ లేదు. అలా కొండ అంచున నిలబడి, క్రిందనంతనీ క్రేన్ షాట్‌లో చూస్తూ, యింకా చాలాసేపు నిల్చోవాలనిపించింది. సూర్యుడు పూర్తిగా దిగిపోయాడు. యిదే సమయమన్నట్టు నల్లమబ్బులు పైన నిండా ఆవరించుకున్నాయి. నీలిమచ్చలు నల్లగా మారాయి.

ప్రకృతి అందమైన అమ్మాయిలా ఉంది. ఆ అమ్మాయికి ఎన్నో వంకర్లు తిరిగిన వాలుజడలా ఉంది కృష్ణ. ఈ చదును లోయం, కొండలు, అడివి అంతా ఓ మహాకవి చెప్పినట్లుంది. రాజు తనకి తానే కవిత్వం చెప్పేసుకుంటున్నాడు.

ప్రకృతి తనని పిలుస్తోంది అనిపించింది రాజుకి. అనిపించేంతలో, ఆమె తనకేసి

(మిగతా భాగం పత్రికలో చదవండి)



(చిత్రకారుడు : బాపు : 1961)

## చందాదారులు కండి!
## కొంత సొమ్ము ఆదా చెయ్యండి!

12 సంచికలకు :: రు. 216 మాత్రమే!
(రు. 24 ఆదా!)
24 సంచికలకు :: రు. 408 మాత్రమే!
(రు. 72 ఆదా!)
36 సంచికలకు :: రు. 612 మాత్రమే!
(రు. 108 ఆదా!)
48 సంచికలకు :: రు. 816 మాత్రమే!
(రు. 144 ఆదా!)
60 సంచికలకు :: రు. 1020 మాత్రమే!
(రు. 180 ఆదా!)
100 సంచికలకు :: రు. 1500 మాత్రమే!
(రు. 500 ఆదా!)
జీవిత చందా : రు. 6000 మాత్రమే!

### విదేశీ చందా వివరాలు:

ఎయిర్ మెయిల్ ద్వారా
12 సంచికలకు
**US $ 54 (or) equivalent Ind. Rupees (US $ 18** ఆదా!)
60 సంచికలకు
**US $ 250 (or) equivalent Ind. Rupees (US $ 110** ఆదా!)
*జీవిత చందా :* **US $ 400 (or) equivalent Ind. Rupees**
గమనిక :విదేశీ చందాదారులు తమ చందాను రూపాయలలో కూడా చెల్లించవచ్చును.

## చందా కూపను
(కొత్త / బహుమతి / పొడిగింపు చందా)

పేరు :....................................................................................
పత్రిక పంపవలసిన
పూర్తి చిరునామా : ..............................................................
..........................................................................................................
...................................................................................................
ఫోన్ నెం. : పిన్ [ | | | | | ]

Sub. Code No. [ ]
Amount Rs..................................................................
D.D/Cheque/M.O. No : ......................... Date.................
To be drawn in favour of "**RACHANA**" payable at **HYDERABAD.** For outstation cheques please add Rs. **50/-** (for amounts upto Rs. 1000/-) and Rs.**65/-** (for amounts above Rs. 1000/-) towards Bank collection charges.

Receipt No. :
Date : Siganture

ఇంటింటిపత్రిక **171**
1-9-286/3,
విద్యానగర్,
హైదరాబాద్ - 500 044

Your e-mail ID : ..................................................................


Owned, Edited, Printed and Published by Y.V.S.R.S. Sai, Phones : 2707 1500 (0) 2707 7599 (R)
Corporate Office Address : 1-9-286/3, Vidyanagar, Hyderabad - 500 044.
Printed at Charita Graphics, 1-8-540/2l, Chikkadpally, Hyderabad - 500 020.